# 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన

*గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే*

**అమరావతి, ఆంధ్రప్రభ:** సికిల్ సెల్ (వ్యాధి) రక్తహీనత (ఎనీమియా)ను 2047 నాటికి నిర్మూలించడమే లక్ష్యంగా 2023లో కేంద్ర ప్రభుత్వం మిషన్‌ను ప్రకటించిందని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్ పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాంతిలాల్ దండే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా సికిల్ సెల్ ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 0-40 ఏళ్ళ మధ్య వయస్సు ఉన్న 7 కోట్ల మందికి అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించడమే సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు. సికిల్ సెల్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా జూన్ 19న ప్రపంచ సికిల్ సెల్ అవేర్‌నెస్ డేని పాటిస్తున్నారని తెలిపారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వాళ్లకి ఈ వ్యాధి వస్తుందన్నారు. దీనిని నిరోధించేందుకు గిరిజనులకు స్క్రీనింగ్ టెస్టులు ప్రారంభించామని, ఇప్పటికే మొదటి దశ పరీక్షలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె. వెంకట మురలి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వ్యాప్తిని పరిశీలించినట్లయితే ప్రతి 86 మంది ట్రైబల్ జనాభాలో ఒకరికి ఈ వ్యాధి వ్యాపిస్తోందన్నారు. మన




రాష్ట్రంలో 0-40 వయస్సుగల గిరిజనులందరికీ అంటే సుమారు 20 లక్షల మందికి స్క్రీనింగ్ టెస్టులు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 1,667 మందికి వ్యాధి నిర్ధారణ కాగా 18,668 మందిని వాహకాలుగా గుర్తించామన్నారు. మన రాష్ట్రంలో సికిలె సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ అయినవారికి రూ.10 వేల పెన్షన్ కూడా అందించడం జరుగుతోందన్నారు. అనంతరం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ పై రూపొందించిన పోస్టర్లు, పాంప్లెట్స్ ను గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు, మెడికల్, పారా మెడికల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.